

ఉచిత ఎమర్జెన్సీ ఫోన్ సౌకర్యం

ప్రజాశక్తి-అరకులోయ: గిరి నేస్తం ఫౌండేషన్ సహకారంతో అరకువేలి మండలం పద్మపురంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సేవ్ గర్ల్ మహిళా భద్రతకై ఉచిత ఎమర్జెన్సీ ఫోన్ సౌకర్యం కల్పించారు. సంస్థ కార్యదర్శి బాలకృష్ణ, కోశాధికారి మధ్య రాజు, పద్మాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టెలి సుస్మిత ప్రారంభించారు. సంస్థ చేపడుతున్న సామాజిక కార్యక్రమాల్లో భాగంగా మహిళలు భద్రతకై ఎమర్జెన్సీ సమయంలో ఉచితంగా ఫోన్ మాట్లాడే సౌకర్యం అన్ని ప్రాంతాల్లో త్వరలో ప్రారంభిస్తామని సంస్థ కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ, గిరినేస్తం ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల్ని ప్రోత్సహిస్తూ భవిష్యత్తులో ఈ సంస్థ మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.



ఉచిత పోన్‌పై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ఘనంగా మహిళా దినోత్సవం


హుకుంపేటలో మాట్లాడుతున్న ఉప సర్పంచ్ కాసులమ్మ


రాజఒమ్మంగిలో మహిళలకు సన్మానం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి మహిళా పోలీసులకు అందజేశారు. మహిళా పోలీసులను సన్మానించారు. ప్రస్తుత సమాజంలో మహిళల పాత్ర కీలకమైందని,అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సై ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని కళ్యాణ మండపం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను గిరిజన మహిళ సంఘం (ఐద్వా) మండల అధ్యక్షురాలు సీసా విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అల్లూరి జిల్లా కార్యదర్శి వి.విజయ మాట్లాడుతూ, మహిళల హక్కులు, చట్టాల అమలుకు చైతన్య పరచాలని సంఘం సభ్యులను కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా చట్టాలను, హక్కులను కాలరాస్తున్నాయన్నారు. గిరిజన మహిళలకు రక్షణ కల్పించి, మాతా శిశు సంక్షేమ పథకాలు అమలు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళ సంఘం కమిటీ సభ్యురాలు సోనియా ఈశ్వరి, మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ, గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను, సిపిఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు, మండల విద్యుత్ కార్మికుల సంఘం కమిటీ సభ్యుడు కిముడు సత్తిబాబు, గిరిజన మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హుకుంపేట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాని వైస్ సర్పంచ్ కాసులమ్మ కోరారు. చినబురుగుపుట్టు గ్రామంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. అనంతరం వైస్ సర్పంచ్ కాసులమ్మ మాట్లాడుతూ,మహిళలు బాగా చదివి మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.మహిళలు సమస్యలు వచ్చినప్పుడు కుంగి పోకూడదని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ కుడెలి పుష్పవతి, జ్యోతి, బండకత్తి కృష్ణవేణి, గల్లుంగి చిలకమ్మ, చీడిపల్లి కొండమ్మ, ఈశ్వరమ్మ, భవాని, సుమిత్ర, నూకలమ్మ, భాగ్య, చెల్లెమ్మ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం

పెదబయలు రూరల్: మండలంలో సీతగుంట పంచాయతీ ఇందిరా కాలనిలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కమిటీ సభ్యులు చెండా లోహితను ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. వృద్ధ మహిళను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్‌లో మహిళలంతా పోరాటాలకు కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి మహిళలు పాల్గొన్నారు.

హుకుంపేట: పెదగరువు, గూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో పారా స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు ప్రధాన ఉపాధ్యాయులు ఎం.కొండమ్మ అధ్యక్షతన నిర్వహించారు. గోడపత్రికలను హెచ్ఆర్ క్లబ్ లీడర్లతో విడుదల చేశారు. అనంతరం సంస్థ జిల్లా సమన్వయ కర్త టి.క్రిష్ణ రావు మాట్లాడుతూ, నిరంతర శ్రమజీవి స్త్రీ మూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

చింతూరు : మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్ఎంఎస్ హాస్టల్‌లో మహిళ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యాన మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా మండల కార్యదర్శి తులసీ, కవిత, ఏటిడబ్ల్యూఓ కె.సుజాత, సిడిపిఓ, ఉపాధ్యాయులు అశ్విని తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు డిఏవి పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, అకౌంట్ ఆఫీసర్ వెంకటరెడ్డి, ఏడిఈ (క్యాంపు) అప్పలనాయుడు పాల్గొని మాట్లాడారు. మహిళలు తమ సొంత బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ కుటుంబ శ్రేయస్సు కొరకు పాటుపడుతున్నారని తెలిపారు. అలాగే ఏపీ జెన్కో కాలనీలో మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామచంద్రరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యూరు : స్థానిక సిఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్‌లో మహిళా పోలీసుల కలిసి మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు శుభకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు, మంప ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మహిళలు అన్ని రంగాలలో పురుషులకు సమానంగా రాణిస్తున్నారని ఎంపిపి గోము వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కొనకం వరలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం మండల మహిళా సమైక్య సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ఆదినారాయణ, ఏపీవో సురేష్ కుమార్, ఎంపీటీసీ కనిగిరి గంగదుర్గ, మండల మహిళా సమైక్య సభ్యులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో మహిళా పోలీసులకు సన్మానం

మే 14, 15, 16 తేదీల్లో
పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ ఏడాది మే 14, 15, 16 తేదీలలో నిర్వహించనున్నట్లు పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్పర్సన్ కొట్ట గుల్లి భాగ్యలక్ష్మి వెల్లడించారు. అమ్మవారి ఆలయంలో పుర ప్రముఖులు గ్రామ పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు, భక్తులతో బుధవారం సాయంత్రం ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఏడాది పాడేరులో మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. మే 12న అమ్మవారి జయంతి రోజు పండగ మొదలుకొని 14, 15, 16 తేదీల్లో జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, భక్తులు, ఉద్యోగ వ్యాపార వర్గాలు తమ సహాయ సహకారాలను అందించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ టి.నరసింగరావు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటగుల్లి సింహాచలం నాయుడు, మాజీ మంత్రి మణి కుమారి, పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, వైస్ సర్పంచ్ బూరెడ్డి రాము, వైస్ ఎంపీపీ గంగ పూజారి శివ, ఆలయ కమిటీ నాయకులు సభ్యులు ఆధ్యాత్మిక సేవా బృందం సభ్యులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ఏర్పాటు.

పాడేరు : మే 14 నుంచి 16 వరకు పాడేరులో నిర్వహించే మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల నిర్వహణకు బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీని నియమించారు. మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్య దొర, ప్రధాన కార్యదర్శులుగా తమర్భ ప్రసాద నాయుడు, నవర కొండబాబు, కార్యదర్శులుగా యాదగిరి శ్రీనివాసరావు, లకే నాని పాత్రుడు, బిక్కవోలు రాంబాబు, బోణంగి వెంకట రమణ, మగాపు సత్య మోహన్ ఎన్నికయ్యారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పెట్రోల్ బంకు నిర్వాహకుల ఎంపిక రద్దు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకుల నిర్వాహకుల ఎంపిక రద్దు చేస్తున్నామని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతగిరి, అరకు వ్యాలీ, ముంచింగిపుట్టు మండలాల్లో నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంకుల నిర్వహణకు కోసం ఎంపికకు సంబందించి, హెచ్‌పిసిఎల్ బ్యాంకు గ్యారంటీ రూ.30 లక్షలుగా నిర్దేశించారన్నారు. స్థానిక గిరిజన యువతీ, యువకులు తమకు అంత ఆర్థిక స్థోమత లేదని ఈ ప్రక్రియపై పలువురు అర్జీలు తెలపటంతో వాటిని ఈ ప్రక్రియను రద్దు చేస్తున్నామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తిరిగి వారి రుసుమును ఐటిడిఎ కార్యాలయం వద్ద తీసుకోవాల్సిందిగా కోరారు.


అధ్వాన రోడ్డును పరిశీలిస్తున్న గిరిజన సంఘం నేత లోతా రామారావు

జడ్డంగి -గొబ్బుల మడుగు
రహదారి నిర్మాణం చేపట్టాలి
గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని జడ్డంగి నుండి గొబ్బులమడుగు మీదుగా డి.భీమవరం వెళ్లే రహదారి నిర్మాణ పనులను తక్షణం చేపట్టాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉన్న మట్టి రహదారి అధ్వాన స్థితిలో ఉన్న విషయాన్ని గిరిజనులు రామారావు దృష్టికి తీసుకురావడంతో బుధవారం ఆయన ఆ రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 2013లో సుమారు రూ.7 కోట్లతో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ రహదారి నిర్మాణ పనులు చేపట్టారని, అయితే నాడు ఫారెస్ట్ అనుమతులు లేవని అటవీశాఖ అడ్డంకులు చెప్పడంతో రహదారి నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయని తెలిపారు. పదేళ్లు కావడంతో మట్టి రహదారి అధ్వానంగా మారిందని, గొబ్బిలమడుగు గండి ప్రమాద భరితంగా ఉందని, ఈ రహదారిపై ప్రయాణించేటప్పుడు తరచూ వాహనాలు ప్రమాదాలు గురై అనేకమంది గిరిజనులు గాయాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి పూర్తయితే ఈ గ్రామాలతో పాటు జడ్డంగి నుండి అడ్డతీగల వెళ్లే వారికి కూడా అణువుగా, దగ్గరగా ఉంటుందని తెలిపారు. అత్యవసర సమయాల్లో ఈ రహదారిపై ప్రయాణం సాగించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శివప్రసాద్, నేను సైతం ఫౌండేషన్ సభ్యులు

ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కొయ్యూరు

నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగంతో కూడిన శిక్షణ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని శరభన్నపాలెంలో ఫౌండేషన్ కార్యాలయంలో ఇప్పటికే వచ్చిన దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను పరిశీలించారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని ప్రతి ఒక్కరూ తక్కువ సమయంలో జీవనోపాధి కల్పించే ఉద్దేశంతో రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చి, ఉద్యోగం కల్పించడమే ధ్యేయంగా పలు కంపెనీలతో మాట్లాడినట్లు చెప్పారు. ఇందులో భాగంగా పదో తరగతి నుండి డిగ్రీ వరకు చదువుకున్న వారు ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ వెల్డింగ్, ఫైర్ సేఫ్టీ ప్లస్, స్కిల్ డెవలప్‌మెంట్, ట్విట్టర్ కోర్సుల్లో ప్రవేశం పొందడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించి, శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పృథ్వీరాజ్, పంచాడ శ్రీరామ్మూర్తి, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఆర్గనైజర్ వంశీ పాల్గొన్నారు.

స్విచ్‌యార్డులో నూతన బ్రేకర్ ఏర్పాటు

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు జల విద్యుత్ కేంద్రం సమీపంలో ఉన్న స్విచ్ యార్డ్‌లో 33 కెవి ట్రాన్స్‌ఫార్మర్ బ్రేకర్‌ను నూతనంగా బుధవారం అమర్చినట్లు ఏపీ జెన్కో ఏడిఈ శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జల విద్యుత్ కేంద్రానికి, సీలేరు ఏపీ జెన్కో కాలనీకి విద్యుత్ సరఫరా చేసే 33 కెవి బ్రేకర్ తరచూ సాంకేతిక లోపాలు తలెత్తి అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని, అప్పుడప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. స్విచ్ యార్డ్‌లో 33 కెవి బ్రేకర్ ఏర్పాటు చేసి 30 సంవత్సరాలు దాటడంతో తరచూ సాంకేతిక లోపాలు ఏర్పడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. దీంతో కొత్త బ్రేకర్ 33 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చామని వెల్లడించారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా సక్రమంగా జరుగుతుందా లేదని టెస్టింగ్ కూడా నిర్వహించామని, ఇకనుంచి జల విద్యుత్ కేంద్రానికి, సీలేరు గ్రామానికి విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకాలు ఏర్పడవని తెలిపారు.


కొత్త బ్రేకర్ అమర్చుతున్న సిబ్బంది

రైతులను నిండా ముంచిన వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి-విఆర్.పురం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం రేఖపల్లిలోని జెడ్‌పిటిసి నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆరోపించారు. నాడు-నేడు అంటూ టిడిపి ప్రభుత్వం నిర్మాణం చేసిన భవనాలకు రంగులు వేయడం కాదని, పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాలక పక్షానికి పతనం ప్రారంభమైందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తోందని, 2022 గోదావరి వరదల్లో మునిగిన ప్రతి గ్రామానికి నష్టపరిహారం చెల్లిస్తుందని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో టిడిపి రాష్ట్ర నాయకులు బొర్ర నరేష్‌కుమార్, నియోజకవర్గ వాణిజ్య విభాగం నాయకులు బీరక సూర్య ప్రకాశరావు, మాజీ జెడ్‌పిటిసి ముత్యాల రామారావు, చంద్రశేఖర్, సవలం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు


నీటిని తెచ్చుకుంటున్న మహిళలు, పెద్దలు

బూరువలసలో తాగునీటి ఎద్దడి
-గెడ్డ నీరే ఆధారం-కాలినడకన తెచ్చుకుంటున్న వైనం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ బూరువలస గ్రామంలో తాగునీటి కోసం మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సౌకర్యం లేక పోవడంతో కిలోమీటర్ దూరంలో కాలిబాటను నడిచి వెళ్లి గెడ్డ నీటిని తెచ్చుకుంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తాగునీటి సమస్యను తీర్చ లేదంటూ గ్రామ ప్రజలు వాపోతున్నారు. బూరు వలస గ్రామంలో గ్రావిటీ స్కీమ్ 2007-2009 సంవత్సర కాలంలో ఏర్పాటు చేశారు. 2012 నుంచి ఊట నీరు సరఫరా కాక వీధి కుళాయిల నుంచి ఆగి పోవడంతో తాగునీటి కోసం మహిళలు అధికారుల చుట్టూ తిరిగారు. సిపిఎం నేతలతో కలిసి ఎన్నో పోరాటాలు చేయడంతో 2020 నాటికి సోలార్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. సోలార్ నుంచి వీధుల్లో కొలాయిలకు పైప్ లైన్ కనెక్షన్ సరిగా ఇవ్వలేదు. తాగునీటి సమస్య తీర్చాలని చెప్పినా పట్టించుకోకపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో దాహన్ని తీర్చుకునేందుకు తాగునీటి కోసం గ్రామ ప్రజలు పరుగులు తీస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు తమ సమస్యను గుర్తించి తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల సంరక్షణ హెచ్‌డబ్ల్యూఒలదే...
ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: విద్యార్థుల సంరక్షణలో లోపాలుంటే ఉపేక్షించనని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ హెచ్చరించారు. ఐటిడిఎ సమావేశ మందిరంలో ఐటిడిఎ పరిధి లోని అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో ఉన్న వసతి గృహాలు, పోస్టుమెట్రిక్ హాస్టల్స్, హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెచ్ డబ్ల్యూఒల విధులను, బాధ్యతలను స్పష్టంగా వివరించారు. నిర్వహించాల్సిన పనులను వివరించి సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. హెచ్ డబ్ల్యూఒలు హెచ్ఎంల పరిధిలో విధులు నిర్వహించాలన్నారు. విధుల పట్ల బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేటాయించిన నివాస గృహంలో లేదా స్థానికంగా ఉండి, విద్యార్థులకు ఎల్లవేళలా నివాసం ఉండి అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ సక్రమంగా అమలు చేయాలని చెప్పారు. వంటగది, డైనింగ్ హాలు వద్ద విధిగా మెనూ చార్టులను ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, ఎటిడబ్ల్యూఒలు ఎల్.రజని, కె.వి.రమణ, హెచ్ డబ్ల్యూఒలు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పిఒ గోపాలకృష్ణ

పలు చోట్ల హోలీ సంబరాలు


సీలేరులో హోలీ సంబరాల్లో పాల్గొన్న యువకులు


హోలీ వేడుకల్లో పాల్గొన్న గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర తదితరులు

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒడిశా సరిహద్దు మల్కన్‌గిరి జిల్లా దొరగూడ పంచాయతీ గొడుగురాళ్లలో బుధవారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామ సమీపంలో సుమారు రెండు ఎకరాలు స్థలంలో గిరిజనులు భారీ ఏర్పాట్లు చేశారు. వారి ఆచారాలకు అద్దం పట్టేలా భోగి మంటలు వేసేందుకు కర్రలతో సుందరంగా అలంకరించి వాటి మధ్యలో జెండా అని ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు పలు సాంస్కృతి కార్యక్రమాలు, ఒడియా నాటకం వంటివి నిర్వహించారు. సరిహద్దు గ్రామాల నుంచి వచ్చిన వేలాది మంది గిరిజనులు తెల్లవారులు తిలకించారు. బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు భోగి మంటను వెలిగించి జెండాను ఎగరవేశారు. అనంతరం వివిధ రంగులు పూసుకుని హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ హోలీ సంబరాలకు వచ్చిన యువతీ యువకులు జంటలుగా మారడం గిరిజనుల ఆచార సాంప్రదాయం.

సీలేరులో...

జీకే.వీధి మండలం సీలేరులో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు రంగులు పూసుకుని కేరింతల కొడుతూ పురవీధుల్లో నృత్యాలు చేశారు. ద్విచక్ర వాహనాలపై ఏపీ జెన్కో ఏఈ సురేష్, కాంట్రాక్ట్ కార్మికులు నాని తదితరులు మెయిన్ బజార్, ఏపీ జెన్కో కాలనీ, పురవీధుల్లో సందడి చేశారు. దుర్గా వీధిలో పలు పాఠశాల విద్యార్థులు చిన్నారులు కేరింతల కొడుతూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటూ రంగులు అలముకొని నృత్యాలు చేశారు.

మోతుగూడెంలో...

మోతుగూడెం : చింతూరు మండలం మోతుగూడెం గ్రామంలో హోలీ పండగ ఘనంగా నిర్వహించారు. మార్కెట్ సెంటర్, ఏపీ జెన్‌కో విధుల్లో యువత రంగులు ఒకరికొకరు పూసుకుంటూ, కేరింతలు మధ్య పండగ చేసుకున్నారు. డీజే సౌండ్స్ మధ్య డ్యాన్సులు చేశారు. ఎంపీటీసీ వేగి నాగేశ్వరావు, వార్డు మెంబర్లు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగూడలో...

డుంబ్రిగూడ : మండలంలో యువత బుధవారం హెూలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. యువతతో పాటు చిన్నారులు వీధుల్లో ఒకరికొకరు రంగు నీళ్ల పోసుకుంటూ సందడి చేస్తూ ఆనందంగా గడిపారు. పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో పర్యాటకులు రంగులు పూసుకుంటూ హెూలీ పండుగను జరుపుకున్నారు.

పెదబయలులో...

పెదబయలు : మండల కేంద్రంలో యువత హెూలీ ఘనంగా నిర్వహించారు. రంగుల నీళ్ల ఒకరి పై ఒకరు సరదాగా చల్లుకున్నారు. ప్రధానంగా మహిళలు ఆదివాసీ జానపద గీతాలు పాడుతూ గిరిజన సంప్రదాయ పద్ధతిలో రంగు నీళ్ళ జల్లు కొన్నారు.

గిరిజన సంఘం కార్యాలయంలో...

అరకులోయ : హెూలీ పండుగ పర్వదినాన అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో యువకులతో కలిసి గిరిజన సంఘం, సిఐటియు నాయకులు ఘనంగా హెూలీ సంబరాలు నిర్వహించుకున్నారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, హెూలీ పండుగ ప్రజల బతుకుల్లో రంగేళి పూయించాలని ఆకాంక్షించారు.ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎన్నికలు జరుగనున్నాయని ఈ ఎన్నికల్లో ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మికులు పట్టభద్రులు ఆలోచించి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్, గిరిజన సంఘం నాయకులు కే.రామారావు, యువకులు సంతోష్, సాయి, మణికంఠ, గంగాధర్ పాల్గొన్నారు.


మోతుగూడెంలో సంబరాలు చేసుకుంటున్న యువత, పిల్లలు


చాపరాయి జలపాతం వద్ద రంగులు పూసుకున్న పర్యాటకులు

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి పనిచేస్తా...

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ



అనకాపల్లిలో మాట్లాడుతున్న రమాప్రభ

ప్రజాశక్తి-యంత్రాంగం

అనకాపల్లి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపిస్తే ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధితో పాటు సిపిఎస్ రద్దు, ఉద్యోగులకు ఇచ్చిన హామీల పరిష్కారం, ప్రభుత్వ సంస్థల పరిరక్షణ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జిఒ నెంబరు 3 పునరుద్ధరణ వంటి పలు అంశాలపై శాసనమండలిలో ప్రస్తావిస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ చెప్పారు. స్థానిక దొడ్డి రామినాయుడు కార్మిక, కర్షక భవనంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం హామీ ప్రకారం వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు ఉత్తరాంధ్ర జిల్లాలకు రాబెట్టేందుకు శక్తివంచనలేకుండా కృషిచేస్తానన్నారు. 250కిపైగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, ప్రజా సంఘాలు బలపర్చిన అభ్యర్థిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానన్నారు. రూ.3.50 లక్షల కోట్ల విలువైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రూ.30వేల కోట్లకు విక్రయించే ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోవడానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు పోరాడతానన్నారు. ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగుల సమస్యల కోసం పనిచేసే వేదిక పిడిఎఫ్ అని తెలిపారు. పిడిఎఫ్ తరపున పోటీచేస్తున్న తనను గెలిపిస్తే ఆయా తరగతుల సమస్యలపై పనిచేస్తానన్నారు. స్కీం వర్కర్ల సమస్యలపై కూడా శాసనమండలిలో ప్రస్తావించి వాటిని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తానన్నారు. ఉత్తరాంధ్రలో మూతపడ్డ సహకార చక్కెర కర్మాగారాల పునరుద్ధరణకు ప్రభుత్వంపై ఒత్తిడితెస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.వరలక్ష్మి, ఎల్ఐసి ఉద్యోగుల యూనియన్ నాయకులు మళ్ల చంద్రశేఖరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు, గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు బి.ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జి.మాడుగుల మండలంలో ప్రచారం చేస్తున్న గిరిజనసంఘం, సిఐటియు నాయకులు

కె.కోటపాడు : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల సమస్యలు, ఉత్తరాంధ్ర జిల్లాల సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ బలపరిచిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని కె.సంతపాలెం గ్రామంలో బుధవారం రమాప్రభకు మద్దతుగా ఎమ్మెల్సీ ఓట్లను కలిసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో అభివృద్ధి జరగాలన్నా, ఎల్ఐసి, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఉండాలన్నా, ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించబడాలన్నా 250 ప్రజాసంఘాల బలపరిచిన రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. రమాప్రభను గెలిపిస్తే శాసనమండలిలో ప్రజల సమస్యలపై గళం వినిపిస్తారని తెలిపారు. విద్యావంతులు డాక్టర్ రమాప్రభ లాంటి వ్యక్తి ఎమ్మెల్సీగా ఎన్నుకోబడడం ఉత్తరాంధ్ర జిల్లాలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినబాబు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు గాడి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ ప్రచారం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పట్టభద్రులను కోరారు. బుధవారం మండలంలోని సూదివలస, మర్రివలస, పాతవలస, శృంగవరం, గొట్లాం తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు రమాప్రభకు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గొర్లే దేవుడుబాబు, నాయకులు రెడ్డి అప్పలనాయుడు, ఎల్లాకు రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కోరెడ్ల రమాప్రభకు ఓట్లు వేసి గెలిపించాలని బుధవారం మండలంలోని భోగాపురం గ్రామంలో సిఐటియు మండల కార్యదర్శి కె సోమనాయుడు తదితరులు ఇంటింటా ప్రచారం చేశారు. గ్రామంలో జరిగిన ఒక పెళ్లి వేడుకలో పట్టభద్రులను కలిశారు.

దుంబ్రిగూడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రామాప్రభను గెలిపించాలని మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో కించుమండ, దుంబ్రిగూడలో ప్రచారం చేపట్టారు.



దుంబ్రిగుడలో ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, శాసన మండలిలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక కర్షకులు, గిరిజనుల సమస్యలపై గళం విప్పే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరడ్ల రమాప్రభను గెలిపించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాగిన ధర్మన్నపడాల్, సిఐటియు మండల కార్యదర్శి దీనబంధు, శంకయ్య కోరారు. మండలంలోని వంతాల, పెదలోచలి, సొలభం పంచాయతీలలో విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటన చేస్తామని చెప్పి అధికారంలోకి వైసీపీ ప్రభుత్వం ఆ ఊసే ఎత్తలేదన్నారు. జివో 3 రద్దైన తర్వాత చట్టబద్ధతకు కనీసం కృషి చేయలేదన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై శాసన మండలిలో గళం వినిపించే పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు.

పాడేరు: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ కోరారు. చింతపల్లి మండలంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల ఇంటింటికి వెళ్లి రమాప్రభ కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. సామాజిక సేవ దృక్పథం, ఉద్యమ పటిమ ఉన్న రమాప్రభను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్ పాల్గొన్నారు.

షిప్‌యార్డు ఉద్యోగ, కార్మికుల హక్కుల పరిక్షణకు కృషి

ములగాడ : హిందుస్థాన్ షిప్‌యార్డ్ సంస్థలోని ఉద్యోగ, కార్మికుల హక్కులు సాధనకు నిబద్ధతతో కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హామీఇచ్చారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా షిప్‌యార్డు గేటు వద్ద ఉద్యోగులు, కార్మికులను కలిసి మాట్లాడారు. విశాఖ అభివృద్ధిలో హిందుస్థాన్ షిఫ్‌యార్డుకు విశేష ప్రాధాన్యత ఉందని, సంస్థ అభివృద్ధికి పాటుపడతానన్నారు. రాజకీయాలకు అతీతంగా 250 ప్రజాసంఘాలు తనకు మద్దతునిస్తున్నాయని, వారి ఆశలు, ఆకాంక్షలు వమ్ముకాకుండా, అందరి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో షిప్‌యార్డు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎంవి.రమణమూర్తి, షిఫ్ యార్డు సిఐటియు అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు రాంజీ, అంబేద్కర్, ఎస్.ప్రసాద్, ఎఐటియుసి నేతలు మళ్ల చిన్నా,



కె.సంతపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, లోకనాథం తదితరులు

సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జోన్ నాయకులు పి.పైడిరాజు, యూనియన్ నేతలు బిఎస్ఎన్ రాజు, జి.సత్యనారాయణ, ప్రసాద్, కె.రామచంద్రరావు, గోవింద్ పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ప్రచారం

భీమునిపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు బుధవారం కొత్తపేట, విల్సన్‌పేట ప్రాంతాల్లో కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి రమాప్రభను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు, ఐద్వా, కెవిపిఎస్, డివైఎఫ్ఐ నేతలు కె.నాగరాణి, భాగం లక్ష్మి, ఎస్ శ్రీనివాసవర్మ పాల్గొన్నారు

గాజువాక : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ గెలుపు కోరుతూ సాయిరాంనగర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి, రమాప్రభను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు పాలూరు లక్ష్మణస్వామి, నాయకులు కె.సంతోషం, సిఐటియు నేత రాంబాబు పాల్గొన్నారు..

ఎన్నికల కరపత్రాల ఆవిష్కరణ

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ఐద్వా నేతలు కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా షీలానగర్‌లో సమావేశమైన ఐద్వా సభ్యులు ఎన్నికల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా నేత మాధురి మాట్లాడుతూ, రమాప్రభ విజయం సాధిస్తే మహిళా సమస్యలపై పోరాడతారన్నారు. కార్యక్రమంలో ఐద్వా విశాఖ కార్యదర్శి సత్యవతి, మణి, రమణి, మాధవి, కరుణ, రాధ, మణి, పద్మ, శ్రీదేవి పాల్గొన్నారు.



షిప్‌యార్డ్ గేటు వద్ద ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

'ప్రజాశక్తి' రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ 25వ వార్షికోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ప్రజాశక్తి సిబ్బంది రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విజయనగరం మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.ఎ.రమణి హాజరై మాట్లాడారు. రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. రక్తదానం ఎవరు, ఎప్పుడు చేయవచ్చు, సేకరించిన రక్తాన్ని ఏ విధంగా విభజిస్తారు, ఉపయోగిస్తారు అన్న విషయాలను వివరించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ, మహిళా సాధికారత కోసం ఆమె చేస్తున్న కృషిని వివరించారు. ఈ రక్తదాన శిబిరంలో పలువురు ప్రజాశక్తి ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ శివనాగేంద్రరెడ్డి, ప్రజారోగ్య వేదిక నాయకులు టి.కామేశ్వరరావు, ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, బ్యూరో చీఫ్ మధుసూధనరావు, ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు

కూచిపూడి నృత్యకళాకారిణి అరుణకు
'నాట్యరత్న' పురస్కార ప్రదానం



పురస్కారాన్ని స్వీకరిస్తున్న కూచిపూడి నృత్యకళాకారిణి అరుణ

ప్రజాశక్తి -పిఎం పాలెం: విశాఖ ద్వారకానగర్‌కు చెందిన కూచిపూడి నృత్యకళాకారిణి అనిపిండి అరుణ నాట్యరత్న పురస్కారాన్ని స్వీకరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 6న హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన మహిళల విశిష్ట కీర్తి పురస్కారాల ప్రదానంలో భాగంగా అనిపిండి అరుణకు ఒడిస్సీ లెజెండరీ డ్యాన్సర్ షరాన్ లోవర్ నాట్యరత్న పురస్కారన్ని అందించారు. తార అకాడమీ ఆధ్వర్యంలో నాట్యరంగానికి నృత్య కళాకారిణి అరుణకు ఈ పురస్కారాన్ని అందించారు. కాగా ఈ ఏడాది జనవరిలోనూ అండమాన్ నికోబార్ ఐల్యాండ్ దీవుల్లో నిర్వహించిన అండమాన్ కళోత్సవ్ సంక్రాంతి సంబరాల్లోనూ జాతీయస్థాయి అవార్డును అరుణ అందుకున్నారు. విశేష అతిథులు భాగవతుల సేతురామ్, మంజుభార్గవి, అరుణ భిక్షు, డాక్టర్ కృష్ణమోహనరావు, తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ వంటి ప్రముఖుల సమక్షంలో అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని అరుణ వెల్లడించారు. పురస్కార గ్రహీత అరుణను పలువురు కళాప్రియులు అభినందించారు.

11న సిరికోన పంచవర్ష సాహిత్యోత్సవాలు

పజాశక్తి -కంచరపాలెం : సిరికోన సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కమిటీ హాలులో ఈనెల 11న సిరికోన పంచవర్ష సాహిత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు సాహితీ పురస్కార గ్రహీత స్వర్ణశైలజ తెలిపారు. బుధవారం మాధవధార ఫంక్షన్ హాలులో మీడియాతో మాట్లాడుతూ, ద్రవిడ వర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ సభాధ్యక్షులుగా వ్యవహరించే ఈ సాహితీ కార్యక్రమంలో సిరికోనీయుల స్వీయ రచనల ప్రదర్శన, పుస్తకావిష్కరణలు, ప్రతిభా పురస్కారాలు, సాహితీ పురస్కారాలుంటాయన్నారు.

సాయంత్రం కవి సమ్మేళనంలో తనతో పాటు విశాఖకు చెందిన పద్మావతి రాంభక్త, దర్భముళ్ల చంద్రశేఖర్‌లకు సన్మానాలు, పురస్కార ప్రదానం జరుగుతుందన్నారు. వెంకటేశ్వర వేద విద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య టి కిషన్‌రావు పాల్గొంటారన్నారు.

కార్మికుల శ్రేయస్సే ముఖ్యం

హిందుస్థాన్ షిప్‌యార్డు చైర్మన్, ఎండీ హేమంత్ ఖత్రి



ఇళ్ల పత్రాలను ఇస్తున్న షిప్‌యార్డు ఎండీ హేమంత్ ఖత్రి

ప్రజాశక్తి -ములగాడ: హిందూస్తాన్ షిప్‌యార్డ్ కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా సంస్థ పనిచేస్తోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రి అన్నారు. బుధవారం కార్మికుల కాలనీలోని ఇళ్లను ఆధునికీకరించి ఉద్యోగుల కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎండీ హేమంత్ ఖత్రి మాట్లాడుతూ, మహిళా దినోత్సవం రోజున కార్మికుల కుటుంంబాలకు ఆధునికీకరించిన ఇళ్లను అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో షిప్‌యార్డుకు మరిన్ని ఆర్డర్స్ రానున్నాయన్నారు. గుర్తింపు యూనియన్ సూచనలు, అభ్యర్థన మేరకు కాలనీ అభివృద్ధితోపాటు కార్మికుల సంక్షేమానికి కృషిచేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఉన్నతాధికారులు,ˆర్తింపు యూనియన్ నాయకులు, ద్యోగులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఫార్మశీ విద్యకు మెరుగైన ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆరోగ్య సంరక్షణ పరిశ్రమలో కీలకమైన ఫార్మసీ విద్యలో ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని పల్సస్ గ్రూప్ సిఇఒ డాక్టర్ శ్రీనుబాబు గేదెల అన్నారు. బుధవారం సత్యం జంక్షన్ పల్సస్ కంపెనీలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ టీచర్స్ (ఎటిపిఐ) ఆధ్వర్యంలో 'ఫార్మశీ విద్యలో మహిళల పాత్ర'పై అనే అంశంపై నిర్వహించిన జాతీయస్థాయి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

సుశిక్షితులైన ఫార్మసిస్ట్‌లు, ఫార్మసీ అధ్యాపకులకు ఇటీవల కాలంలో డిమాండ్ పెరిగిందన్నారు. మహిళా ఉద్యోగులకు, ముఖ్యంగా ఫార్మసీ గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లకు పల్సస్ కంపెనీ ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తోందన్నారు. పల్సస్ ఉద్యోగులలో 75శాతం మంది మహిళలేనన్నారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ టివి నారాయణ మాట్లాడుతూ, ఫార్మసీ విద్యారంగానికి మహిళలు చేస్తున్న సేవలను అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా గుర్తించిందన్నారు. రోగి సంరక్షణ, మెరుగైన వైద్యం అందించడంలో ఫార్మసిస్ట్‌లు సమర్థవంతంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. మహిళాదినోత్సవం సందర్భంగాఈ కార్యక్రమం నిర్వహించారు.

కిడ్నీల ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే...

ప్రజాశక్తి -గాజువాక : మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి మూత్రపిండాలను పదిలంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ రమ్య వేదుల తెలిపారు. ఏటా మార్చినెల రెండో గురువారం నిర్వహించే ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం సందర్భంగా కిడ్నీల ఆరోగ్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన అవసరమన్నారు. ఈ ఏడాది 'అందరికీ కిడ్నీ ఆరోగ్యం, ఊహించని వాటి కోసం సిద్ధమౌతోంది, బలహీనులకు మద్దతు ఇస్తుంది' అనే థీమ్‌తో ముందుకెళ్తున్నారన్నారు. దీర్ఘకాలిక కిడ్నీ సంబంధిత వ్యాధులు (క్రానికల్ కిడ్నీ డిసీజెస్-సికెడి), కిడ్నీ మార్పిడి వల్ల కలిగే ఇబ్బందులపై



అవగాహన పెంచుకోవాలని సూచించారు. సికెడి రోగులు తొలిదశలోనే గుర్తించి, వైద్యుల సూచనల మేరకు అప్రమత్తమై తగు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి తీవ్రతను నిరోధించవచ్చన్నారు. వాటిలో ముఖ్యమైనది రక్తంలో చక్కెర నియంత్రణ, హెచ్‌బి ఏ1సీ ఏడు కంటే తక్కువగా ఉండాలి. ఇక రెండోది రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవడం. పెయిన్ కిల్లర్స్ వీలైనంత తక్కువగా వాడాలి. ధూమపానం మానేయడం, వ్యాయామం చేయడం, ఎక్కువ కొవ్వు ఉన్న పదార్థాలను తినడం మానేయాలి.

ఆరోగ్యకరమైన మూత్రపిండాలకు ఎనిమిది నియమాలు

- ★ ఆరోగ్యంగా,చురుకుగా ఉండండి
- ★ రక్తంలో చక్కెన శాతాన్ని రెగ్యులర్‌గా చెక్ చేసుకోవడం
- ★ బిపిని అదుపులో ఉంచుకోవడం
- ★ సమతుల ఆహారాన్ని తీసుకోవడం
- ★ ఆరోగ్యకరమైన పానీయాలను మాత్రమే తీసుకోవడం
- ★ ధూమపానం మానేయడం
- ★ పెయిన్ కిల్లర్ మాత్రలు వాడకం మానేయడం
- ★ మూత్రపిండాల పనితీరును తనిఖీ చేయడం

ఈ ఆహారాలకు దూరంగా ఉండండి

- రెడ్ మీట్ (మటన్, బీఫ్) రొయ్యలు
- ఫాస్ట్ ఫుడ్
- శీతల పానీయాలు
- చికెన్, చేపలు, గుడ్డు పచ్చసోన, బీన్స్, బటర్, చీజ్, పెరుగు, చక్కెర, ఉప్పు

కిడ్నీల ఆరోగ్యానికి ఇలా చేయండి

- ◆ సమతుల్య ఆహారం తీసుకొండి
- ◆ రోజూ 2-3 లీటర్ల నీరు తాగండి
- ◆ నిత్యం వ్యాయమం చేయండి.

(మార్చి నెల రెండో గురువారం ప్రపంచ మూత్రపిండాల సంరక్షణ దినోత్సవం సందర్భంగా....)



డాక్టర్ రమ్య వేదుల,
కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్,
ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్
కిమ్స్ ఐకాన్, వైజాగ్.

రక్తదానంతో ప్రాణదాతలు కండి



రక్తదాన శిబిరంలో రాజబాబు, ఇతర టిడిపి నేతలు

ప్రజాశక్తి -మధురవాడ: రక్తదానం మరొక ప్రాణదానమని టిడిపి మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పిలకవానిపాలెంలో పిళ్ళా భరత్‌కుమార్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏడవవార్డు కార్పొరేటర్ పిళ్ళా మంగమ్మ, టిడిపి నేత పిళ్ళా వెంకట్రావు ఆధ్వర్యంలో భరత్ కుమార్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ బ్లడ్‌బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ, ఏటా తన కుమారుడు పేరిట మంగమ్మ, వెంకటరావు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భరత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాలీబాల్ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భీమిలి టిడిపి ఇంచార్జ్ కోరాడ రాజబాబు, స్థానిక నేతలు మొల్లి లక్ష్మణరావు, నాగోతి సూర్యప్రకాష్, పోతిన సోముపాత్రుడు, పోతిన బాలాజీ, గొల్లంగి ఆనందబాబు, పోతిన నాయుడు పాల్గొన్నారు.